జాగ్రత్తలతో మూగజీవాల సంరక్షణ

- పశువులపై సరైన జాగ్రత్తలు తప్పనిసరి
- నిర్లక్ష్యం వహిస్తే మృత్యువాత పడే అవకాశం
- వేసవిలో పశువులకు పచ్చిమేత ఆరోగ్యకరం



గుడివాడరూరల్: మండుటెండలో మూగజీవాల సం'రక్షణ'కు పశు పోషకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పాడిపై ఆధారపడిన రైతులకు ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తోంది. గేదెలు, ఆవులకు ప్రమాదవశాత్తూ ఏదైనా జరిగినా తక్షణమే వైద్య సాయం అవసరమైతే 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే క్షణాల్లో పశు వైద్యులు అంబులెన్స్ ద్వారా అక్కడికి చేరుకుని ప్రాణాలు కాపాడుతున్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత పెరుగుతున్న తరుణంలో పాడి రైతులు జాగ్రత్తలు పాటిస్తే పశువులు మృత్యువాత పడకుండా కాపాడుకోవచ్చని పశు వైద్యులు పేర్కొంటున్నారు. చలువ పందిళ్ల కింద పశువులను ఉంచడం వల్ల ఆరోగ్యంగా ఉంటాయి.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల్లో శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. చమటలు ఎక్కువగా బయటకు రావటం, దాహం అధికంగా పెరగడం, మేత సరిగా మేయకపోవడం, శ్వాస కష్టంగా ఉండటం, ఎదకు సరిగ్గా రాకపోవడం, గర్భస్రావం వంటి సమస్యలు తలెత్తుతాయి.

చికిత్స..

వడదెబ్బకు గురైన పశువులను గుర్తించి వెంటనే చికిత్స చేయించాలి. చల్లటి ప్రదేశాల్లో ఉంచి తేలికగా జీర్ణం అయ్యే దాణా, గంజిలో ఉప్పు కలిపి ఆహారంగా ఇవ్వాలి. వైద్యులను సంప్రదించి డెక్రోజ్ సెలైన్ ద్రావణాన్ని రక్తనాళంలోకి విటమిన్ ఏ, డీ సూది మందులను, విటమిన్ సీ,బీ కాంప్లెక్స్ సూదిమందులను వేయించాలి. రోజుకు 40 లీటర్ల నీటిని తాగించాలి.

పచ్చిమేతే రక్షణ

వేసవిలో పశువులకు పచ్చిమేత అందించాలి. పచ్చిగడ్డి పశువుల శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. పోషక విలువల కోసం ఖనిజ లవణ మిశ్రమం(మినరల్ మిక్సర్) వంటివి వాడాలి. పచ్చగడ్డి సదుపాయం లేని రైతులు పాతర వేసిన యూరియా గడ్డిని అందిస్తే ఫలితం ఉంటుంది. ఈ గడ్డిలో 45–55 శాతం వరకు తేమ ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత తగ్గి పాల దిగుబడి పెరిగే అవకాశం ఉంది. పశువుల పాక వద్ద పేడ, పెంట కుప్పల మీద వాలే దోమలు, ఈగల నివారణకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలి.

అప్రమత్తంగా ఉండాలి



వేసవిలో రోజురోజుకి పెరుగుతున్న ఎండల నేపథ్యంలో పశువుల పట్ల పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలి. పశువులు వడదెబ్బకు గురికాకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలి. వేసవిలో పశువులకు వచ్చే వ్యాధులను సకాలంలో గుర్తించి దగ్గరలో ఉన్న పశు వైద్యులను సంప్రదిస్తే వాటి ప్రాణాలను రక్షించుకోవచ్చు. గ్రామాల్లో చాలా మంది రైతులు పాడి సంపదపై జీవిస్తున్నారని. మూగజీవాల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు పశు పోషకులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏ మాత్రం అనుమానం వచ్చినా వెంటనే దగ్గరలోని పశు వైద్యశాలకు తీసుకొచ్చి వైద్యం చేయించాలి.

–వి.హనుమంతరావు, పశు వైద్యాధికారి

పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పశువులకు కొట్టం ఏర్పాటు చేసుకోవాలి. పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కొట్టంలోకి గాలి, వెలుతురు బాగా ప్రవేశించేలా ఏర్పాటు చేసుకోవాలి. పరిశుభ్రమైన చల్లని నీటిని అందుబాటులో ఉంచాలి. పచ్చని, ఎండుగడ్డి సమృద్ధిగా అందించాలి. సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధులకు కారణమయ్యే గోమార్లు, దోమలు, ఈగలను నిర్మూలించాలి. గేదెల పాకలు చల్లగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పశువుల పాక పైకప్పును గడ్డితో కప్పి నీళ్లు చల్లుతూ ఉండాలి. వీలైనంత వరకు పాక పరిసరాల్లో చల్లటి నీడనిచ్చే చెట్లను పెంచుకోవాలి. రోజుకు రెండు, మూడు సార్లు పశువులను చల్లటి నీటితో కడగాలి. వేసవిలో ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం ఐదు గంటలపైన మాత్రమే మేత కోసం పశువులను బయటకు తోలాలి. ఎండ ఉన్న సమయంలో మేతకు బయటకు తోలకూడదు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎంపిక



గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ఎంపిక ఆదివారం జరిగింది. స్థానిక శ్రీనివాస సెంటర్‌లో గల స్వచ్ఛంద సేవా సంస్థ సర్వసభ్య సమావేశంలో ఈ నూతన కార్యవర్గ ఎంపిక జరిగినట్లు అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి తెలిపారు. నూతన అధ్యక్షుడిగా అన్నపురెడ్డి గోపిరెడ్డి, కార్యదర్శిగా నందమూరి పద్మజ, కోశాధికారిగా గంటా చంద్రశేఖర్, డైరక్టర్‌గా పి.వేణుగోపాలరావు, చైర్మన్‌గా దండమూడి జయలక్ష్మి, కన్వీనర్‌గా ఉప్పలపాటి మారుతీప్రసాద్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన జమ్ము పావనికి (567/600) ప్రోత్సాహకంగా రూ.5 వేలు అందజేసినట్లు వివరించారు. అనంతరం స్వచ్ఛంద సేవా సంస్థకు వివిధ రూపాలలో సహకరించిన, ఆర్థిక ప్రోత్సాహాన్ని అందజేసిన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ పీవీ శేషగిరిరావు, కో–చైర్మన్ వేణుగోపాలరావు, డైరెక్టర్లు దండమూడి సీతారామస్వామి, వంగా శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, ఎస్. ఉదయ భాస్కర్‌రాజు, బొగ్గారపు తిరుపతయ్య పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం



దగ్ధమైన పూరింటి వద్ద బాధితులు

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండల పరిధిలోని కొక్కిలిగడ్డలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అధికారి పీఎస్‌బీవీ ప్రసాదరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ కాలనీకి చెందిన రాచూరి లంకేశ్వరావు పూరింటిలో వంటగ్యాస్ లీకయి మంటలు వ్యాపించినట్లు తెలిపారు. ఈ మంటల్లో వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయని సుమారు రూ.80 వేలు నష్టం వాటిల్లి ఉంటుందన్నారు. చుట్టు పక్కల మంటలు వ్యాపించకుండా సిబ్బంది మంటలను అదుపు చేసినట్లు తెలిపారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలిదిండి: డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలిదిండి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డీఎస్‌వీఎస్.ప్రసాద్ ఆదివారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత, ప్రస్తుతం పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఈ నెల 27 నుంచి ఏపీ పాలిసెట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు పాలిటెక్నిక్ కళాశాల సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఇటీవల జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఇక్కడ కోర్సు పూర్తి చేసిన 100 శాతం విద్యార్థులు మంచి కంపెనీలలో ఉద్యోగం సాధించారని తెలిపారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగిందని కళాశాల ఆడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 192 మందికి 182 మంది హాజరయ్యారని, పది మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌లో 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పరీక్షకు 192 మందికిగాను 182 మంది హాజరయ్యారని, పది మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రశాంతంగా పరీక్ష జరిగిందని ఆయన తెలిపారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు క్యూలో తెల్లవారుజామునుంచే బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో ఎటు చూసినా భక్తులతో నిండిపోయింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్ల శాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో 2007-08 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

పమిడిముక్కల: వీరంకిలాకు కల్యాణ మండపంలో పమిడిముక్కల హైస్కూల్‌కు చెందిన 2007–08 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 15 సంవత్సరాల కిందట చదువుకున్న విద్యార్థులంతా కలుసుకుని ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. చదువుకునే రోజుల్లో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

రమాబాయి వర్ధంతిని నిర్వహించాలి

మండవల్లి: ఈ నెల 27న బాబా సాహెబ్ అంబేడ్కర్ సతీమణి, త్యాగమూర్తి రమాబాయి వర్ధంతి అన్ని గ్రామాల్లో నిర్వహించాలని అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి అధ్యక్షుడు కె.శాంతరాజు, సామాజిక కార్యకర్త ఎల్ఎస్ భాస్కరావు కోరారు. అంబేడ్కర్ విగ్రహాల వద్ద రమాబాయి చిత్రపటాలు పెట్టి, పూల మాల వేసి కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు వినియోగించుకోవాలి



మ్యూజికల్ చైర్ ఆడుతున్న విద్యార్థులు



ముదినేపల్లి శాఖా గ్రంథాలయం వద్ద ఆటలపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



గ్రంథాలయంలో పొడుపు కథలు చదువుతున్న విద్యార్థులు

కలిదిండి: విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయడమే గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం ముఖ్య ఉద్దేశమని గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు అన్నారు. కలిదిండి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం, మ్యూజికల్ చైర్ ఆటలను ఆదివారం నిర్వహించారు. రమేష్ బాబు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ముదినేపల్లిరూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో పుస్తకపఠనం చేయించారు. ఉపాధ్యాయురాలు కె.తేజస్విని నీతికథలు చెప్పారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి విద్యాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులతో పొడుపు కథలు చదివించినట్లు గ్రంథాలయాధికారి షేక్ పర్వీన పేర్కొన్నారు. డిక్లరేషన్, జనరల్ నాలెడ్జ్ కార్యక్రమం నిర్వహించారు. చెస్, క్విజ్, జనరల్ నాలెడ్జ్, స్పోకెన్ ఇంగ్లిష్ వంటి అంశాలు నేర్పిస్తున్నామన్నారు. జూన్ 7వ తేదీవరకు శిబిరాలు కొనసాగుతాయన్నారు.

కథలు చదవడం అలవర్చుకోవాలి

కైకలూరు: విద్యార్థి దశ నుంచి కథలు చదవడం అలవాటు చేసుకోవాలని కై కలూరు శాఖా గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా కైకలూరు గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో కథలు చదివించారు. అనంతరం కుర్చీల ఆట ఆడించారు. చివరి రోజున వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని శ్రీనివాసరావు తెలిపారు. గ్రంథాలయ సిబ్బంది ఎ.లక్ష్మి పాల్గొన్నారు.

వృత్తి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



సమావేశంలో మాట్లాడుతున్న ఉస్మాన్‌బాషా

పెడన: సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శివార్జున నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో పేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్– శారీ పెయింటింగ్ శిక్షణ తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు సహాయ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్ భాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సహాయ కేంద్రం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జూన్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణ తరగతులకు అర్హులైన పేద మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు నెలల శిక్షణకు, 7వ బ్యాచ్‌కు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులు అనంతరం పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు అందిస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యి శిక్షణ పొందాలనుకునే వారు పెడన భట్టజ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న రాధా కృష్ణభవన్‌లో గల శివార్జున నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య ఆసక్తి ఉన్న వారు ఆధార్ జీరాక్స్ వెంట తీసుకుని సంప్రదించాలన్నారు. వివరాలకు 98666 13913, 99664 19220, 79933 44708లో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో మట్టా రాధాకృష్ణమూర్తి, కాగిత సాంబశివరావు, కొండవీటి సుధారాణి, ట్రైనర్స్ రామినేని దుర్గ, వాసా భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి ఝాన్సీరాణి



జమీగొల్వేపల్లిలో తాము తయారు చేసిన ఆకృతులను చూపుతున్న విద్యార్థులు

జమీగొల్వేపల్లి(పామర్రు): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత ఎన్నో ఆవిష్కరణలకు కారణమవుతుందని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషా దేవి అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి గ్రామంలో శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ పద్ధతుల ద్వారా విద్యార్థులు తయారు చేసిన ఆర్ట్స్‌ను ప్రదర్శించారన్నారు. పలు రకాల ఆకృతులను కాగితాలు, వ్యర్థ పదార్థాలతో తయారు చేసి వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ వంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయుక్తం అవుతాయన్నారు. కార్యక్రమంలో యోగా గురువు పొట్లూరి ధర్మారావు, గ్రంథాలయ అధికారి కె.నాగసురేష్, స్థానికులు బాబూరావు, రాజు పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు కంప్యూటర్‌లో శిక్షణ తరగతులు నిర్వహించామని గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి అన్నారు. అంతే కాకుండా జాతీయ గీతాలు నేర్పించడం జరిగిందన్నారు.

మిల్క్ యూనియన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ట్రీవీస్ నిర్మించిన దాత హరికృష్ణను సన్మానిస్తున్న చైర్మన్ ఆంజనేయులు

ఎలకుర్రు(పామర్రు): కృష్ణా మిల్క్‌యూనియన్ అందిస్తున్న సేవలను పశు పోషకులు సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని విజయవాడ కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చెలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఎలకుర్రు గ్రామంలోని పాల సేకరణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక పాల ఉత్పత్తి దారులతో ఆయన మాట్లాడుతూ పశువులకు మినరల్ మిక్చర్ వాడటం వలన కలిగే లాభాలను తెలిపారు. పశుపోషకులకు అందుబాటులో ఉన్న మేలుజాతి పశువుల సెమెన్ వినియోగించి మేలు జాతి సంతతిని పొంద వచ్చన్నారు. పశు సంతతి పెంపొందడం వలన పాల ఉత్పత్తి పెరిగే అవకాశాలున్నాయన్నారు. అనంతరం గ్రామంలో పాల కేంద్రం వద్ద పశువుల వైద్యసేవల నిమిత్తం సుమారు రూ.3 లక్షలతో నిర్మించిన ట్రీవీస్, దానిపై స్లాబ్‌ను నిర్మించిన దాత హరికృష్ణను సన్మానం చేశారు. కార్యక్రమంలో పాల సేకరణ కేంద్ర అధ్యక్షుడు కె.ఉమామహేశ్వర రావు, జిల్లా ట్రస్టు బోర్డు జిల్లా సభ్యుడు బి.కృష్ణా రెడ్డి, పామర్రు పాల శీతల కేంద్రం మేనేజర్ సీహెచ్‌డీకే గోపీనాథ్ పాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఉదయానికే ఆలయానికి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారి పుట్టలో పాలు పోసేందుకు, పాల పొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసేందుకు అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. నాగబంధాల వద్ద పూజలు చేశారు. గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు.



స్కేటింగ్ నేర్చుకుంటున్న చిన్నారులు



కబడ్డీ ఆడుతున్న బాలురు



క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్

నవ క్రీడాకారుల కార్ఖానా ఎన్టీఆర్ స్టేడియం



కరాటే నేర్చుకుంటున్న చిన్నారులు

గుడివాడ టౌన్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ స్టేడియం నవ క్రీడాకారుల కార్ఖానాగా మారింది. వేసవి శిక్షణలతో స్టేడియం గ్రౌండ్ కళకళలాడుతోంది. విద్యార్థులు వేసవి సెలవల్లో తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు ఎన్టీఆర్ స్టేడియంలో వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. వందల సంఖ్యలో క్రీడాకారులను తయారు చేయడం, ప్రతి సంవత్సరం వారిలో మెరుగైన క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపుతున్నారు. ఈ స్టేడియం క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో సైతం ప్రతిభను కనబర్చి బంగారు పతకాలు సాధించారు. ఈ క్రమంలో ఈ ఏడాది సైతం వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అటు అధికారులు, రాజకీయ నాయకులు సైతం వీటి ప్రారంభోత్సవం, చిన్నారులకు ప్రోత్సాహాలు వంటి కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. దీంతో వేసవి శిక్షణ తరగతుల విషయం ప్రచారానికి సైతం స్టేడియం ఉద్యోగులు సాహసం చేయలేదు. యథావిధిగా ఈ ఏడాది కూడా క్రీడాశిక్షణ సాధారణంగా కొనసాగుతున్నప్పటికీ నవ క్రీడాకారుల్లో ఏమాత్రం నిరాశ కలగకూడదని వాటిని కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వివిధ విభాగాల్లో శిక్షణ విషయానికి వస్తే కరాటే–60, చదరంగం–20, క్రికెట్–30, బాస్కెట్‌బాల్–80, కబడ్డీ–30, ఖో–ఖో–30, యోగా–30, వెయిట్ లిఫ్టింగ్–25, స్కేటింగ్–96, మొత్తం–401 మంది యువ క్రీడాకారులకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఈ శిక్షణ ప్రారంభించినట్లు స్టేడియం యాజమాన్యం తెలిపింది. ఇది నిరంతర ప్రక్రియ అని అన్ని క్రీడలకు ఉదయం, సాయంత్రం శిక్షణ కొనసాగిస్తామన్నారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించి సమాజానికి అందించడమే స్టేడియం లక్ష్యమని ఉద్యోగులు అధికారులు పేర్కొన్నారు.



వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ



బాస్కెట్‌బాల్లో తర్ఫీదు

ముగిసిన జగన్నాథుడి కల్యాణోత్సవాలు



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న తహసీల్దార్

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి శ్రీజగన్నాథస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారం జరిగిన అన్నసమారాధనతో ముగిశాయి. ఉత్సవాల్లో ఈ నెల 21న స్వామిని పెండ్లికుమారుడు, అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా చేసి ప్రారంభించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణం, రథోత్సవం అనంతరం శనివారం రాత్రి విశేషపూజలు, ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించి పవళింపు సేవ చేపట్టారు. గుడివాడకు చెందిన శ్రీ కళా రంజని నాట్యమండలి ఆధ్వర్యంలో బాలనాగమ్మ నాటకం ప్రదర్శించారు. ముగింపురోజైన ఆదివారం అఖండ అన్నసమారాధన తహసీల్దార్ ఎస్.ఎల్.ఎన్.లక్ష్మీనరసకుమారి ప్రారంభించారు. ఈ సమారాధనకు పరిసర గ్రామాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మూడు వేల మంది భక్తులు సమారాధనలో పాల్గొన్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు, చైర్మన్ మద్రివాడ సుబ్బలక్ష్మి తెలిపారు.